



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

పొరపాట్లు జరిగితే చర్యలు

- రీసర్వేపై కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద జరుగుతున్న రీ సర్వేలో పొరపాట్లు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటారని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషా హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రీ సర్వే ప్రాజెక్ట్ నిర్వహణపై రెవెన్యూ , సర్వే సిబ్బందికి కలెక్టర్, పి.రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ కింద ప్రతి మండలంలో ఒక గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద రీ సర్వే ప్రక్రియ జరుగుతోందన్నారు. రీ సర్వేకు సంబంధించిన ఎస్ఒపి (స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్)ను విఆర్ఒలు, సర్వేయర్లు క్షుణ్ణంగా అవగాహన చేసుకొని రీ సర్వే ప్రక్రియ నిర్వహిస్తే పొరపాట్లకు ఆస్కారం ఉండదని కలెక్టర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ నిర్వహణపై రెవెన్యూ , సర్వే సిబ్బందికి డివిజన్ స్థాయిలో కూడా శిక్షణ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్‌ఒలను ఆదేశించారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఒ సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, ఎడి సర్వే మునికన్నన్ పాల్గొన్నారు.

అప్పుడే భగభగలు..!



- మొదలైన ఎండ తీవ్రత
- 38 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత
- వేసవి తాపానికి అల్లాడుతున్న ప్రజలు

ఫిబ్రవరి నెలలోనే జిల్లాలో భానుడు భగభగలాడుతున్నాడు. జిల్లాలో అత్యధికంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వేసవి తాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఎండను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఫిబ్రవరి రెండో వారంలోనే భానుడి భగభగలు మొదలయిపోయాయి. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. కర్నూలు జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట అత్యధికంగా 36 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ ఏడాది 38 డిగ్రీలకు చేరుకుంది. కర్నూలు నగరంలో బుధవారం అత్యధికంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా వ్యాప్తంగానూ అదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధిక ఉష్ణోగ్రత వల్ల ఎండ సెగ తీవ్ర స్థాయిలో కనిపించింది. ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలోని రాజ్ విహార్ కూడలి, కలెక్టరేట్, బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రాంతం, కొండారెడ్డి బురుజు ప్రాంతాలు మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి. జిల్లాలోని ప్రధాన పట్టణాలు, నగరాల్లోనూ అదే పరిస్థితి కనిపించింది. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు.

ఎక్కువ ప్రమాదం ఎవరికంటే..

ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు

ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తరువాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

బుధవారం అత్యధిక ఉష్ణోగ్రతలు ఇలా..

నగరం	గరిష్ట ఉష్ణోగ్రత (సెల్సియస్‌లో)
కర్నూలు	38
ఆళ్లగడ్డ	38
నంద్యాల	37
డోన్	37
బనగానపల్లె	37
ఆదోని	36
ఎమ్మిగనూరు	37
పత్తికొండ	36
మంత్రాలయం	37
కోడుమూరు	37
పాణ్యం	37
ఆత్మకూరు	36
నందికొట్కూరు	37
ఆలూరు	36

ఎపిజిబి ప్రధాన కార్యాలయం కడపలోనే ఉండాలి

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఎపిజిబి) ప్రధాన ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు డి.రియాజ్‌బాషా డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో వేసిన పోస్టరును కార్మిక కర్షక భవన్‌లో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించడానికి కావలసిన అన్ని అర్హతలు ఉన్నాయని తెలిపారు. అన్ని గ్రామీణ బ్యాంకుల కంటే ఎక్కువ మందిని కస్టమర్లను కలిగిన బ్యాంకుగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉందని వారు తెలిపారు. సొంత ఆస్తులతో కూడిన ప్రధాన కార్యాలయం కలిగి ఉందని అన్ని రకాల ఇన్ఫ్రాస్ట్రక్చర్ కూడా కలిగి ఉందని తెలిపారు. అన్ని గ్రామీణ బ్యాంకుల కంటే అధిక బ్రాంచీలు కలిగి ఎక్కువ ఎటిఎంలో కలిగిన బ్యాంకుగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉందని అన్నారు. వెనకబడిన ప్రాంతాలైన రాయలసీమ జిల్లాలలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉండడం అవసరమని తెలిపారు. బ్యాంకు ఏర్పడినప్పటి నుండి రైతులకు, చిన్న వ్యాపారస్తులకు సేవలు చేయడంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ముందంజలో ఉందని అన్నారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కడపలోనే ప్రధాన కార్యాలయం ఉండేంతవరకు సిఐటియు నాయకత్వంలో పోరాటాల కొనసాగిస్తామని తెలిపారు. సిఐటియు న్యూ సిటీ కమిటీ కార్యదర్శి సాయిబాబా, ఓల్డ్ సిటీ కమిటీ కార్యదర్శి విజయ్, బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి.వివేక్, కె.నాగరాజు, డి. వెంకటేష్ ,కె. హరిసుందర్ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్ఐసిలో నూతన నియామకాలు చేపట్టాలి

- భోజన విరామంలో ఎఐఐఇఎ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

క్లాస్ మూడు,నాలుగు క్యాడర్లలో నూతన నియామకాలు చేపట్టాలని, ఎఐఐఇఎ యూనియన్‌ను గుర్తించాలని ఎఐఐఇఎ జిల్లా కార్యదర్శి ఆర్ సునీయ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు ఎల్ఐసి ప్రధాన కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎల్ఐసి ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సునీయకుమార్ మాట్లాడుతూ సమ్మె పిలుపును సంపూర్ణంగా విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు ప్రత్యక్షంగా పాల్గొని నినాదాలు చేశారని తెలిపారు. నిన్నటి తరం పోరాడటం వల్లనే నేడు సంస్థ బలంగా నిలబడిందన్నారు. మనకు ఎల్ఐసిలో ఉద్యోగాలు కూడా వచ్చాయన్నారు. దీనిని మనం బాగా పనిచేసి కాపాడుకోవాలన్నారు. అంతకుమించి సంస్థను ప్రభుత్వ రంగంలో నిలబెట్టుకునేందుకు పోరాడాలన్నారు. అప్పుడే ఈ సంస్థ మరో వందేళ్ళ భారతీయ సమాజానికి శక్తినిస్తుందన్నారు. మరెంతోమందికి రాబోయే రోజుల్లో ఈ సంస్థలో ఉద్యోగాలు వస్తాయన్నారు. దేశంలో 80 శాతం మందికి, కడప డివిజన్లో 99 శాతం ఎల్ఐసి సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎఐఐఇఎకి ప్రభుత్వం గుర్తింపు ఇవ్వకపోవడం మనకు అవమానం కాదా అని ప్రశ్నించారు. కాబట్టి మనం నినదించాల్సిందే, పోరాడాల్సిందే, మన సంఘానికి గుర్తింపు సాధించాల్సిందే ! అప్పుడే మన హక్కులు నిలబడతాయన్నారు. మన ఆత్మగౌరవం కాపాడబడుతుందన్నారు. క్లాస్ త్రీ అండ్ ఫోర్ నియామకాలు చేపట్టేలా కృషి చేయాలన్నారు. ఎల్ఐసి లో కేవలం ఈ ఆర్థిక సంవత్సరం 9 నెలల లోనే 3,130 మంది క్లాస్ 3, 4 తరగతుల్లో సిబ్బంది తగ్గిందని, పాలసీదారులకు మెరుగైన సేవలందించేందుకు నూతన నియామకాలు తక్షణ అవసరమని అన్నారు. సంస్థలో నూతన నియామకాలు చాలాకాలంగా జరగడంలేదని, తక్షణం ఈ క్యాడర్లలో రిక్రూట్మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. నూతన నియామకాలు, యూనియన్ గుర్తింపు అంశాలపై తమ ఆకాంక్షలను ఎల్ఐసి సిఇఒకు ఈనెల 11న వినతిపత్రం ఇచ్చామన్నారు. నిరసనలో మక్బూల్ అహ్మద్, రమేష్, గని, జాకీర్ పాల్గొన్నారు. నిరసనకు సంఘీభావంగా ఎన్ఎఫ్ఐ ఎఫ్‌డబ్ల్యుఐ కార్యదర్శిరమేష్, లియాఫీ నాయకులు గజేంద్ర రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేపడుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి

- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి శూన్యం
- కలెక్టరేట్ ఎదుట వామపక్షాల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి నిధుల కేటాయింపులో ప్రతిసారి మొండిచెయ్యి చూపుతుందని సిపిఎం, సిపిఐ నాయకులు విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధికి నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి నిధుల కేటాయింపు విషయంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో బుధవారం నిరసన తెలిపారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్, సిపిఐ నగర సమితి కార్యదర్శి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించడంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఘాటుగా విమర్శించారు. ఢిల్లీ ఎన్నికల కోసం మద్దతు ప్రజలను మచిక చేసుకోవడం కోసం కొంత ప్రయత్నం చేయడం తప్ప ఆంధ్ర రాష్ట్ర రాజధానికి నిధులు కేటాయించడంలో పోలవరం నిర్మాణం కోసం నిధులు కేటాయించడంలో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ఆదుకోవడం కోసం, కడప స్టీల్‌ఫ్యాక్టరీ నిర్మాణం కోసం నిధులు కేటాయించడంలో ఏమాత్రం శ్రద్ధ చూపలేదని విమర్శించారు. రాయలసీమ డిక్లరేషన్ పేరుతో బిజెపి నాయకులు గతంలో గగ్గోలు పెడుతూ సంకలు గుద్దుకుంటూ తిరిగారే మరి ఈరోజు కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ఎందుకు మాట్లాడటం లేదో సమాధానం చెప్పాలని నిలదీశారు. జిల్లాల పునర్విభజన తర్వాత అత్యంత వెనకబడిన జిల్లా కర్నూలు జిల్లాగా ఉందన్నారు. ఈ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు ఆటకెక్కాయని ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయడం లేదని, పరిశ్రమల నిర్మాణం కోసం ఉపన్యాసాలు తప్ప ఆచరణలో ఒక పరిశ్రమ కూడా రాలేదన్నారు. వలసలు నివారణ కోసం నామమాత్రపు చర్యలు కూడా ఈ ప్రభుత్వాలు తీసుకోవడం లేదన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది కార్మికులు, వ్యవసాయ కూలీలు వలసలు వెళ్తున్నారని, ఈ ప్రభుత్వం వలసల నివారణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వంపై ఆధారపడి ఉన్నప్పటికీ నిధులు రాబట్టడానికి ఒక బంగారు లాంటి అవకాశం ఉన్నప్పటికీ చంద్రబాబు నాయుడు ఎందుకు గట్టిగా మాట్లాడి నిధులు రాబట్టడం లేదో సమాధానం చెప్పాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టు కోసం నిధులు కేటాయించడానికి ఎందుకు ప్రశ్నించడం లేదని వెనకబడిన ప్రాంతాల అభివద్ధి కోసం నిధులు కేటాయించడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,000 వేల కోట్లు కేటాయిస్తామని, గతంలో ప్రధాని చెప్పాడని మరి బడ్జెట్లో ఎందుకు రూ.6000 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఇప్పటికైనా బడ్జెట్లో సవరణ చేసి వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం రూ.పదివేల కోట్ల కేటాయించి వెనకబడిన జిల్లాను ఆదుకోవాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు టి. రాముడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గురుశేఖర్, అరుణ, విజయ్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు విజయ్, షరీఫ్, అబ్దుల్ దేశాయ్, రామకృష్ణ, సిహెచ్.సాయిబాబా, సుధాకర్, యేసు, నరసింహులు, శేషాద్రి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న వామపక్ష నాయకులు

శ్రీశైలం బ్రహ్మోత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్



శ్రీశైలంలో జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైల దేవస్థానానికి సంబంధించిన అధికారులు, వేద పండితులు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. జిల్లా కలెక్టర్ కు శ్రీశైలం దేవస్థానం తీర్థ ప్రసాదాలను అందజేసి వేద పండితులు ఆశీర్వదించారు.



దుర్వాసనతో కాలుతున్న చెత్త కుప్పలను చూపుతున్న పిపిఎస్ఎస్ నాయకులు

శుభ్రం చేసే దిక్కులేదు ...

దుర్వాసనతో కాలుతున్న చెత్త కుప్పలు.. మద్యం ఖాళీ సీసాలు...

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూల్ నగరపాలక సంస్థలో రూ.6 లక్షల జనాభాకు తాగునీరు అందించేందుకు వందల రూ.కోట్ల వెచ్చించి నిర్మించిన తాగునీటి ట్యాంకులకు సున్నం కొట్టి.. పరిసరాలను శుభ్రం చేయకుండా స్మశానాలను తలపించేలా తయారు చేశారని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎస్.అన్వర్‌బాష, ఎన్.శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై ప్రతివారం లాగే బుధవారం కలెక్టరేట్ ప్రక్కన తాగునీటి ట్యాంకు పరిసరాల్లో పర్యటించారు. అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను చూసి చలించి పోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ, సచివాలయాలో దాదాపు 20 మంది దాకా ఉన్న ఇంజనీర్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తాగునీటి ట్యాంకుల పరిసరాల్లో సున్నం కొట్టి శుభ్రం చేయాలని స్పృహ కూడా లేకుండా తయారయ్యారని విమర్శించారు. కలెక్టరేట్ పక్కనే ఉన్న తాగునీటి ట్యాంకు పరిసరాల్లో తగలబడుతున్న చెత్త కుప్పలూ.. మందు బాబులు వదిలేసిన మద్యం సీసాలు, దుర్వాసనతో స్మశానాలను తలపించేలా ఉందంటే ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఏమిటో అర్థమవుతుందన్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళితే సంబంధిత ఇంజనీరు ఇంటికి పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గత నెల రోజులుగా బాలాజీనగర్, విష్ణు టౌన్‌షిప్, పాత బస్టాండుమీదుగా జమ్మి చెట్టు వరకు ఉన్న తాగునీటి ట్యాంకులు, వాటి పరిసర ప్రాంతాల్లో పర్యటించామని తెలిపారు. ఎక్కువ ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. సూపరిండెంట్ ఇంజనీరు మున్సిపల్ కమిషనర్ వెంటనే తాగునీటి ట్యాంకులను,వాటి పరిసరాలను పరిశీలించి.. సున్నం గొట్టి శుభ్రం చేయాలని కోరారు. ఈ పర్యటనలో పిపిఎస్ఎస్ నాయకులు ఎం నాగరాజు, సివివర్మ, మహమ్మద్ యూనుస్, ఎస్.రమణగౌడ్, ఎన్ మద్దిలేటి, బి.శశి కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి

-అకాడమిక్ క్యాలెండర్ పాటిస్తాం
- ఆర్‌యు విసిగా బాధ్యతలు స్వీకరించిన వివి బసవరావు


ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రానున్న మూడు సంవత్సరాల్లో వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని వైస్ ఛాన్సలర్ వి.వెంకట బసవరావు అన్నారు. వర్సిటీలో అకాడమిక్ క్యాలెండర్ తప్పనిసరిగా పాటిస్తామన్నారు. రాయలసీమ యూనివర్సిటీకి విసిగా నియమితులైన వి.వెంకట బసవరావు బుధవారం పదవి బాధ్యతలను చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీలో ఉన్న సమస్యలన్నిటిని అధ్యయనం చేస్తానన్నారు. వర్సిటీ పూర్వ విద్యార్థులతో అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్‌కు రిజిస్ట్రార్ బిఆర్.విజయ్ కుమార్ నాయుడు, సిడిసి డీన్ సివి కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్స్ నరసింహులు, హరిప్రసాద్ రెడ్డి పరీక్షల విభాగం డీన్ వెంకటేశ్వర్లు, భరత్ కుమార్, సుందరానందపుచ్చా తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.



ఆర్‌యు విసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వి వెంకట బసవరావు

డిఆర్‌డిఎ పిడి గా రమణారెడ్డి



ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా వైవి రమణారెడ్డి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఇన్చార్జి పిడిగా మెప్మా పిడి నాగ శివ లీల వ్యవహరిస్తున్నారు. అనంతపురం జిల్లా కెటి రాజుపాలెం సంస్థలు విజిలెన్స్ ఆఫీసర్గా పనిచేస్తున్న రమణారెడ్డి ఇక్కడికి డిఆర్‌డిఎ పిడిగా బదిలీ అయి వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషను మర్యాదపూర్వకంగా పుష్పగుచ్చం అందజేసి కలిశారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

-ఇళ్ళ ముందు వేలాడుతున్న విద్యుత్ తీగలు
-ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించని అధికారులు
-ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. నగర్ ఏర్పడినప్పుడు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇళ్ళ ముందు విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న స్తంభాలను తొలగించాలని స్థానికులు ప్రజాసంఘాల నాయకులు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. మునిఫర్‌నగర్‌లో 18 వరుసల లైన్లు ఉన్నాయి. అంతర్గత రహదారుల వెడల్పు కేవలం 18 నుంచి 20 అడుగుల మధ్య దూరం ఉండటంతో విద్యుత్ తీగలు ఇళ్ళ ముందు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. మొదటి అంతస్తు ఇంటి నిర్మాణం చేపట్టాలంటే విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొన్ని లైన్లలో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ప్రమాదాలు జరిగిన సమయంలో అధికారులు హడావుడి చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చేయడం లేదు. ముజఫర్‌నగర్‌లో ఒరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వేలాడుతున్న విద్యుత్ తీగలకు రక్షణ కవచాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

విరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించండి

వెంకటమ్మ 18వ లైన్ స్థానికురాలు ముజఫర్ నగర్



మా వీధిలో ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభం విరిగింది. ఒకవైపునకు ఒరిగింది. ఇటీవల ఒక చెట్టు కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడడంతో షార్ట్ సర్క్యూట్ జరిగింది. చెట్టుకొమ్మ బరువుకు విద్యుత్ స్తంభం మరింత ఒరిగింది. ఈ స్తంభం ఎప్పుడైనా ఇళ్లపై పడే అవకాశం ఉంది. ప్రమాదాలు జరగవచ్చు.

విద్యుత్ ప్రమాదాలను అరికట్టండి

విజయ్ 31 వ వార్డు నాయకులు డివైఎఫ్ఐ



ముజఫర్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ అంశంపై విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రాలు అందించాం. అధికారులు ఎవరూ స్పందించడం లేదు. ప్రమాదాలు జరిగితేనే అధికారులు స్పందిస్తారా అర్థం కావడం లేదు. ఒకసారి ముజఫర్‌నగర్‌లోని అన్ని వీధులను అధికారులు పరిశీలించాలి. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.





పారిశుధ్యంపై ఫిర్యాదులు రావద్దు

నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో ప్రతి వీధి చివరి వరకు పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఆదేశించారు. బుధవారం ఆయన నగరంలోని ఆదిత్య నగర్, సంపత్ నగర్, గురు రాఘవేంద్ర నగర్, బిర్లా కాంపౌండ్, వడ్డేగిరి, కెవిఆర్ గార్డేన్స్ కాలనీ సమీపంలోని హంద్రీ నది పరివాహక ప్రాంతంలో జరుగుతున్న పారిశుధ్య, జంగిల్ క్లియరెన్స్ పనులను కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. జన నివాసాలతో పాటు సమీపంలో ఉన్న నదీ పరివాహక ప్రాంతాల్లో, ఖాళీ స్థలాలను సైతం శుభ్రంగా ఉంచాలన్నారు. పిచ్చి మొక్కలు ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. పారిశుధ్యానికి సంబంధించి ప్రజల నుండి పదేపదే ఫిర్యాదులు రానీయొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎఇ మహేష్, పారిశుధ్య తనిఖీదారులు అనిల్ కుమార్, ఆంజనేయులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు , బాధితులు

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని దండిగేరిలో నివసించే అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సభ్యులు ఎస్ఎండి. షరీఫ్, డి. అబ్దుల్ దేశాయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు దండిగేరీ లోని సచివాలయం నెంబర్ 20, 21 ఎదుట ధర్నా చేశారు. మూస మియా పాషా అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ విధివిధానాలను రూపొందించి అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రతి ఇంటికీ రూ.ఐదు లక్షలు సబ్సిడీతో కూడిన రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.బాడుగ ఇళ్లల్లో ఉంటూ ప్రభుత్వం వేస్తున్న వివిధ రకాల భారాలు చెల్లిస్తూ ప్రజలు మోయలేని భారాలతో సతమతమవుతున్నారని తెలిపారు. అర్హులైన ప్రజలను గుర్తించి విచారించి తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు .లేని పక్షంలో పేద అర్హులైన వారిజాబితాను తయారుచేసి ఆ ప్రజలతో కలిపి ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సలీంబాష, వాసింబాష ,యాస్మిన్ బిబి ఆయేషా, సాలేహా, కుర్షిద్ బీ తదితరులు పాల్గొన్నారు.


శ్మశాన వాటికను పరిశీలిస్తున్న నాయకులు

గ్రామస్తుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం ఆపాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్మశాన వాటిక సమస్యలో గ్రామస్తుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం ఆపాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.ఆనంద్‌బాబు హితవు పలికారు. బుధవారం మండలంలోని చెట్నిహల్లి గ్రామంలోని శ్మశాన వాటికను, అక్కడ ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్మశాన వాటిక కోసం కేటాయించిన సర్వే నెంబర్ 125, 126ను శుభ్రం చేసి ఉపయోగపడేలా చూడాలని, అక్కడున్న 113లో మృతదేహాలను పూడ్చుతున్నా అధికారులు మాత్రం ఇరు వర్గాలపై కేసులు పెట్టి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఈ సమస్యతో గ్రామంలో ఎలాంటి రచ్చ చేయాలనుకున్నారని మండిపడ్డారు. సర్వే నెంబర్ 113 రస్తా వరుసలో శ్మశానం ఉందని తెలిసినా శ్మశాన వాటికను రద్దు చేయకుండా అక్కడే ఇంటి స్థలాలు కేటాయించారని తెలిపారు. సర్వేనెంబర్ 125, 126ను స్పష్టంగా శ్మశాన స్థలం కేటాయించినట్లు ఉందని, అక్కడ సౌకర్యాలు కల్పించకపోవడంతో ఎవరూ పూడ్చేందుకు అక్కడికి వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని చెప్పారు. గ్రామస్తులు కూడా ఆలోచించాలని తెలిపారు. అంటరానితనాన్ని భౌతికంగా జీవించే దళితులు, ఇప్పటికీ అదే అతిథ్య పదార్థాల మధ్య జీవించాలనుకోవడం అంటరానితనాన్ని ప్రేరేపించడమే అవుతుందన్నారు. దళితుల ఇళ్ల మధ్య ఉన్న శ్మశాన వాటికను సంపూర్ణంగా తొలగించి, 125, 126లో ఉన్న శ్మశాన వాటికకు దారిని ఏర్పాటు చేయాలని కోరారు. శ్మశానాన్ని శుభ్రం చేయడంతో పాటు చుట్టూ ప్రహరీ నిర్మించి, బోరు వేసి, షెడ్డు నిర్మించాలని తెలిపారు. లేకపోతే జిల్లా వ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, మండల కార్యదర్శి అంజి, కటికాపరుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మారెప్ప, సురేష్, గ్రామ నాయకులు రాజు, దానియేల్, నాయకులు అనిల్, లక్ష్మన్న, ఎస్.వీరేష్, అబ్రహాం, విజయ్, చిన్న తిక్కన్న, నరసన్న, శాంతిరాజు, దేవపుత్ర, లక్ష్మారి నరసన్న పాల్గొన్నారు.

కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయవద్దు

- డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ


మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ శాంతికళ

ప్రజాశక్తి - ఆదోని

కళ్లకు సోకే వ్యాధులను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని డిఎంహెచ్ఒ శాంతికళ విద్యార్థులకు సూచించారు. బుధవారం మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో పాఠశాల విద్యార్థులకు ఆగస్టు నుంచి డిసెంబర్ 2024 వరకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 201 పాఠశాలల్లో 1,26,412 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. వీరిలో 3,700 మందికి దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించి, ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. దృష్టి లోపం ఉన్న 160 మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఎమ్మెల్సీ మధుసూదన్, మున్సిపల్ ఛైర్మన్ శాంత, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఎంఇఒ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, హాలిమ్ సిద్దిక్, జిల్లా అంధత్వ నివారణ అధికారి సంధ్యరెడ్డి, డాక్టర్ వినోద్, సూపర్‌వైజర్లు మంజునాథ్, సీతారాముడు, స్వరూప్, నాగరాజ్ ఉన్నారు.

'ముళ్ల రహదారికి' మోక్షం

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - నందవరం



నందవరం గ్రామంలో బీసీ కాలనీలో కొన్నేళ్లుగా కనుమరుగైన రహదారికి మోక్షం కలిగింది. శుక్రవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురించిన 'ముళ్ల దారి' కథనానికి అధికారులు స్పందించారు. పొలాలకు వెళ్లేందుకు రైతులకు, గ్రామానికి తాగునీరు సరఫరా చేసే బావికి ప్రధాన రహదారి ముళ్ల చెట్లతో మూసుకుపోయి కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది. ఆ రహదారి వీధి మధ్యలో ఉండడం, చెట్లు మలచి అడవిలా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ప్రజల ఇబ్బందులకు అధికారులు తాత్కాలిక ఉపశమనం కలిగించారు. బుధవారం ఇఒఆర్‌డి సందీప్ పర్యవేక్షణలో జెసిబి సహాయంతో ముళ్ల చెట్లను తొలగించారు. చెట్లను తొలగించి రహదారి ఏర్పాటు చేయడంపై వీధి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'జలజీవన్' పూర్తయ్యేనా..?

- నత్తనడకన పనులు..!
- వేసవిలో తాగునీటి సమస్య తీరుతుందా..?

ప్రజాశక్తి - గోనెగండ్ల

గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల జీవన్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టాయి. గత ప్రభుత్వ హయాంలో పనులు అరకొరగా సాగాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో పనులు చేపట్టి ఇంటింటికీ ఉచిత కుళాయి ద్వారా తాగునీరందించి ప్రజల దాహార్తిని తీరుస్తామని హామీ ఇచ్చింది. క్షేత్రస్థాయిలో ఈ పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటి సమస్య జటిలమవుతున్నందున పాలకులు, అధికారులు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


ఇంటెక్ వెల్ బ్రిడ్జి

గోనెగండ్ల మేజర్ పంచాయతీలో సుమారు 22 వేల జనాభా ఉంది. ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు సుమారు రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అందుకు సంబంధించి 19 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేసేందుకు అవసరమైన పైపులు వచ్చి చేరాయి. ఈ నిధులతో గ్రామంలో 4 ఒహెచ్ఎస్ ట్యాంకులకు గాను ఒకటి పూర్తయింది. మరో మూడు ట్యాంకులు, ఎస్ఎస్ ట్యాంకు వద్ద అదనంగా మరో ఫిల్టర్ బెడ్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ పనులను త్వరగా పూర్తి చేస్తే గ్రామంలో ప్రజల తాగునీటి కష్టాలు తీరుతాయి. గ్రామంలో ప్రస్తుతం నాలుగు రోజులకొకసారి నీటి సరఫరా జరుగుతోంది. ఈ పనులు పూర్తయితే రోజూ కాకపోయినా కనీసం రోజు విడిచి రోజైనా నీటి సరఫరా జరుగుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పథకం పూర్తయితే 16 గ్రామాలకు తాగునీరు

గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద రూ.19.50 కోట్ల జల జీవన్ మిషన్ నిధులతో నూతనంగా నిర్మాణం చేపట్టిన గాజులదిన్నె తాగునీటి పథకం పనులు పూర్తయితే మండలంలోని 16 గ్రామాలకు తాగునీరు అందించవచ్చు. గతంలో ఈ పథకం పనులు శిలాఫలకానికే పరిమితమయ్యాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి చొరవతో ఇంటెక్ వెల్, ఫుట్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాగా రోజుకు 50 లక్షల లీటర్ల సామర్థ్యం



కలిగిన రాపిడ్ శ్యాండ్ ఫిల్టర్, సంపు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు కూడా నిలిచిపోయాయి. ఈ పనులను ఏడాదిలోపు పూర్తి చేసి గ్రామాలకు తాగునీటి సరఫరా చేస్తామని ఎమ్మెల్యే బీవీ హామీ ఇచ్చారు. ఈ హామీ నెరవేరాలంటే పనులను వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

4, 5 రోజుల్లో ఇంటింటికీ కుళాయి పనులు

- శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ

మండలంలోని 28 గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు జలజీవన్ మిషన్ పథకం కింద రూ.34 కోట్లతో 32 పనులు మంజూరయ్యాయి. వాటిలో 5 పనులు పూర్తికాగా 17 పనులు వాటర్ గ్రిడ్ పథకంలోకి కన్వర్ట్ అయ్యాయి. మిగతా పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 4, 5 రోజుల్లో ఇంటింటికీ ఉచిత కుళాయి పైపులైన్ పనులను ఎమ్మెల్యే బీవీ ప్రారంభించనున్నారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేసి ప్రజల తాగునీటి సమస్యను తీర్చేందుకు చర్యలు చేపడతాం.

కూటమి గెలుపుతో గ్రామాలాభివృద్ధి

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం

కూటమి గెలుపుతో గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కనకవీడు పేట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అతి తక్కువ కాలంలోనే ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించామన్నారు. పేట గ్రామంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి రైతులకు తోడుగా మినీ గోకులాలను నిర్మించామని తెలిపారు. గ్రామంలో తిరుగుతూ నూతనంగా చేపట్టిన రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. టౌన్ బ్యాంకు వైస్ ఛైర్మన్ నరసప్ప, పిఆర్ డిఇ చంద్రశేఖర్, ఎంపిడిఒ పుల్లయ్య, ఇఒఆర్‌డి సందీప్, ఎఇలు నరసింహులు, మూర్తి, నాగేంద్రప్ప, టిడిపి నాయకులు గురురాజ్ దేశాయి, ఖాసీం వలీ, రామకృష్ణారెడ్డి, చిన్న రాముడు, ఐటిడిపి వీరేష్, ఆదిశేషు, రాజేష్ రెడ్డి, డబ్బా ఈరన్న, సత్యా రెడ్డి, ఉదయ్ గౌడ్, సామ్యేల్, ప్రభాకర్ పాల్గొన్నారు.


బీవీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

కార్పొరేట్ల కోసమే కేంద్ర బడ్జెట్

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ
- కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా వామపక్షాల నిరసన

ఫొటో : ఆదోనిలో నిరసన
ఫొటో- దేవనకొండలో...

ప్రజాశక్తి - ఆలూరు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ బడా, కార్పొరేట్ల కోసమే పెట్టినట్లు ఉందని, రైతులకు, కార్మికులకు, కర్షకులకు మేలు చేసే విధంగా లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూపేష్ మండిపడ్డారు. బుధవారం అఖిలభారత వామపక్షాల పిలుపులో భాగంగా ఆలూరు అంబేద్కర్ సర్కిల్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రూ.50 లక్షల కోట్లతో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం సంపన్నుల కోసమే అన్నట్లు ఉందని, దేశంలో ఆదాయాన్ని సృష్టించే కార్మికులకు, కర్షకులకు, రైతులకు ఏమాత్రం రాయితీలు ప్రకటించకుండా.. సామాన్యులపై భారాలు మోపే విధంగా ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టం హామీలను అమలు చేయాలని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వేదవతి, నగరడోనా రిజర్వాయర్ల నిర్మాణం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. లేకపోతే వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం, సిపిఐ మండల కార్యదర్శి పి.హనుమంతు, రామాంజనేయులు, విఠల్, కృష్ణ, నాగరాజు, వీరేష్, సిద్ధ లింగ పాల్గొన్నారు. **మంత్రాలయం** తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎమ్‌డి.అంజిబాబు, సిపిఐ మండల కార్యదర్శి నాయక్, సిపిఎం మండల నాయకులు ప్రాణేష్, అనిల్, అంజి, రాజు, వీరేష్, లక్ష్మన్న, సురేష్ పాల్గొన్నారు. **ఆదోని**లోని భీమాస్ సర్కిల్ నుంచి వామపక్షాల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహిస్తూ పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో నిరసన చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, జిల్లా నాయకులు రామాంజనేయులు, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, జిల్లా నాయకులు లక్ష్మిరెడ్డి, పట్టణ కార్యదర్శి సుదర్శన్ మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, విభజన హామీల మాట ఒక్కటి కూడా లేదని తెలిపారు. సిపిఎం నాయకులు ఈరన్న, గోపాల్, తిప్పన్న, కృష్ణమూర్తి, నాగరాజు, వీరారెడ్డి, వీరేష్, వెంకటేష్, సిపిఐ నాయకులు బసాపురం గోపాల్, విజయ్, రాజు, లక్ష్మీనారాయణ, ఈరప్ప ఉన్నారు. **దేవనకొండ**లోని అంబేద్కర్ సర్కిల్‌లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం మండల నాయకులు యూసుఫ్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.వీరశేఖర్, సిపిఐ మండల కార్యదర్శి ఎమ్.నరసరావు మాట్లాడారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్యాకేజీపై బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం విచారకరమని మండిపడ్డారు. సిపిఐ, సిపిఎం ప్రజాసంఘాల నాయకులు అశోక్, రవి, నాగేంద్ర, పాండు, కోదండ, మహాదేవ, మహేష్, శ్రీనివాసులు, గోపాల్, పెద్దయ్య, మహేంద్ర, రాము, అంజి పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని బస్టాండ్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం శాఖ కార్యదర్శి కరుణాకర్, సిఐటియు నాయకులు నబి రసూల్, ఆటో యూనియన్ నాయకులు బాష, రంగస్వామి, హనుమన్న, బడేసా, సురేష్, వీరేష్, తేజ పాల్గొన్నారు.


మంత్రాలయంలో నిరసన తెలుపుతున్న వామపక్షాలు



ఆలూరులో నిరసన తెలుపుతున్న వామపక్షాలు



ఆదోనిలో నిరసన తెలుపుతున్న వామపక్షాలు


దేవనకొండలో నిరసన తెలుపుతున్న వామపక్షాలు

'వైన్ షాపును తొలగించాలి'

ప్రజాశక్తి - ఆదోని

నిబంధనలకు విరుద్ధంగా నెలకొల్పిన మద్యం షాపును తొలగించాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదోనిలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ సైదులుకు సంతకాల సేకరణ పత్రం, వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని పట్టణం కొత్త బస్టాండ్ రోడ్డు సుంకలమ్మ దేవాలయం పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన న్యూ దీప్తి వైన్ షాపు వల్ల సమీపంలోని పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానికుల నుంచి అభ్యంతరాలు, సేకరించిన సంతకాల సేకరణ ప్రతులను డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నాగరాజు, వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు కృష్ణమూర్తి, మోహన్ సమక్షంలో సిఐకి అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించారు. నాగరాజు, గౌస్ ఉన్నారు.

కడపలోనే మెయిన్ బ్రాంచిని ఉంచాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆదోని

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మెయిన్ బ్రాంచి కడపలోనే కొనసాగించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ మాట్లాడారు. ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించకుండా కడపలోనే కొనసాగించాలని ఇప్పటికే నిరసనలు చేపట్టామని తెలిపారు. బ్యాంకు ప్రధాన కార్యాలయం అమరావతికి మార్చాలనే ఆలోచన సరికాదన్నారు.

రైతు విశిష్ట సంఖ్య కలిగి ఉండాలి

ప్రజాశక్తి - హాలహర్వి

రైతు సేవా కేంద్ర పరిధిలో ఉన్న ప్రతి రైతూ విశిష్ట సంఖ్యను (యూనిక్ ఐడి) నమోదు చేసుకోవాలని ఎఒ శివశంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని గూళ్యం రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి రైతూ పంటలను నమోదు చేయించుకుని ఈకేవైసి తప్పకుండా చేసుకోవాలని తెలిపారు. విఎఎలు గురు స్వామి, రాజేష్, ఎఇఒ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు ఆర్‌టిసి డిపో గ్యారేజ్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు, పట్టణ నాయకులు ఎ.సురేష్ కోరారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆర్‌టిసి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. డిపో కార్మికులు పిఎస్.రాజు, ఎమ్‌డి.హనీఫ్, రసూల్, ఈరన్న, మాబాష, రాముడు, గోపాల్, శ్రీరాములు, వీరేష్ పాల్గొన్నారు.

శ్రీమఠం హుండీ లెక్కింపు పూర్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో చేపట్టిన హుండీ లెక్కింపు ప్రక్రియ పూర్తయినట్లు శ్రీమఠం మేనేజర్ వెంకటేష్ జ్యోషి తెలిపారు. బుధవారం శ్రీమఠం ఆవరణలో దేవదాయ శాఖాకారులు, శ్రీమఠం అధికారుల సమక్షంలో సేవాదారులతో కలిసి లెక్కింపు చేపట్టారు. ఫిబ్రవరిలో దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. 28 రోజుల హుండీ ఆదాయం నగదు రూపంలో రూ.3,29,15,105, బంగారం 58 గ్రాముల 150 మిల్లీగ్రాములు, వెండి 1280 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.

వలస కూలీ మృతి

ప్రజాశక్తి - కౌతాళం



కుటుంబ పోషణ కోసం గుంటూరుకు వలస వెళ్లిన వలస కూలీ హరిజన నాగేష్ (28) బుధవారం మృతి చెందారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మండలంలోని సులేకేరి గ్రామానికి చెందిన హరిజన మూకప్పకు ఐదుగురు కుమారులు. నలుగురు అన్నదమ్ములు తమ కుటుంబాలతో కలిసి గుంటూరు ప్రాంతానికి వలస వెళ్లారు. ఉదయం మిరప పంట పొలానికి అందరూ కలిసి కూలి పని కోసం ట్రాక్టర్‌లో బయల్దేరారు. ప్రమాదవశత్తు ట్రాక్టర్‌పై నుంచి హరిజన నాగేష్ కింద పడడంతో తలకు గాయాలయ్యాయి. అతను అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు శోకసంద్రంలో మునిగారు. కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

21న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈనెల 21న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ అల్లా బకాష్ తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు మండలంలోని 13 పంచాయతీల్లో దాదాపు 450 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారందరికీ ఈనెల 21న మండల కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంటర్వ్యూలకు చిప్పగిరికి చెందిన కెనరా బ్యాంకు, నేమకల్లు ఎపిజిబి బ్యాంకుకు చెందిన అధికారులు హాజరవుతారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరూ సకాలంలో హాజరుకావాలని కోరారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. **దేవనకొండ** మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని దేవనకొండ, పి.కోటకొండ, కప్పట్రాళ్ల, తెర్నేకల్లు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుల మేనేజర్ల సమక్షంలో దరఖాస్తులను పరిశీలించనున్నట్లు తెలిపారు. బీసీ కార్పొరేషన్ రుణాల అర్జీదారులు ఒరిజినల్ డాక్యుమెంట్స్‌తో హాజరు కావాలని కోరారు.

నకిలీలపై చర్యలేవి..?

- నోటిఫికేషన్ ఇవ్వకుండా మళ్లీ నియామకాలు..!
- అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు శూన్యం

ప్రజాశక్తి - ఆలూరు

విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలు మళ్లీ చేపట్టారు. ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా.. కాసులకు కక్కుర్తి పడి గుట్టుచప్పుడు కాకుండా నియామకాలు చేపట్టారు. అర్హులైన నిరుద్యోగులు నష్టపోతున్నారు...

నియోజకవర్గంలోని కోగిలతోట విద్యుత్ సబ్ స్టేషన్ గతేడాది ఫిబ్రవరిలో ప్రారంభమైంది. సబ్ స్టేషన్‌లోని 4 షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులకు నోటిఫికేషన్ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం నియామకాలు చేపట్టకుండా నియామక కమిటీ సభ్యులైన ఇఇ, ఎస్ఇ, కాంట్రాక్టర్ కలిసి నలుగురిని నియమించారు. అక్రమ నియామకాలు చేపట్టడమే కాకుండా వారిలో నకిలీ సర్టిఫికెట్ ఉన్నాయని ప్రజాశక్తి వరుస కథనాలు రాసింది. 9 నెలల తర్వాత వారి సర్టిఫికెట్లను డైరెక్టర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ప్రభుత్వ ఐటిఐ విజయవాడ వారు నకిలీగా నిర్ధారించడంతో వారిని తొలగించారు. నియమించిన నలుగురిలో ముగ్గురు సంబంధిత అధికారులకు ముడుపులు చెల్లించినట్లు తెలిసింది. మరొకరు విద్యుత్ శాఖలో ఉన్నతస్థాయి అధికారి ఆదేశాలతో నియమించినట్లు సమాచారం.

నోటిఫికేషన్ లేకుండా మళ్లీ నియామకాలు

నకిలీలను తొలగించిన నెల తర్వాత కోగిలతోట విద్యుత్ సబ్ స్టేషన్‌లో నోటిఫికేషన్ లేకుండా మళ్లీ నియమించినట్లు తెలిసింది. వారిలో గతంలో నకిలీ సర్టిఫికెట్ అని నిర్ధారించిన ఒకరిని, స్థల దాతది కూడా నకిలీ సర్టిఫికెట్ అని నిర్ధారించారు. అతను మరొకరిని ప్రపోజ్ చేసిన వారిని, పక్క జిల్లాలోని ఓ నియోజకవర్గ ప్రజాప్రతినిధి సిఫార్సుతో ఒకరిని, విద్యుత్ శాఖలోని ఉన్నత స్థాయి అధికారి సిఫార్సుతో మరొకరిని విధుల్లోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరిలో కూడా ముగ్గురు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడం గమనార్హం. వీరిలో కూడా నకిలీ సర్టిఫికెట్లు ఉన్నట్లు సమాచారం.



నకిలీ సర్టిఫికెట్లపై చర్యలేవి..?

గతంలో నియమించిన వారిలో నకిలీ సర్టిఫికెట్ అని నిర్ధారించిన వారిపై, నియమించిన వారిపై చర్యలు తీసుకోవడం లేదు. భారీగా ముడుపులు ముట్టినట్లు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- పిఎస్.రాధాకృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు



ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా అక్రమంగా నియమించారు. నకిలీ సర్టిఫికెట్ అని తెలిసినా మళ్లీ నియమించినా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై కేసులు నమోదు చేయాలి.

మా ప్రమేయం ఏమీ లేదు

- సంతోష్ కుమార్, డిఇఇ



కోగిలతోట సబ్ స్టేషన్‌లోని ఆపరేటర్ పోస్టులను నియమించడంలో మా ప్రమేయం లేదు. జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ చెప్పిన నరుగురిని ట్రైనింగ్‌కు తీసుకోమని ఆదేశించడంతో వారిని తీసుకున్నాం.


కౌతాళంలో అవగాహన కల్పిస్తున్న సిఐ

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

- సిఐ అశోక్ కుమార్

ప్రజాశక్తి - కౌతాళం

విద్యార్థులు ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సిఐ అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రతిభ హైస్కూల్‌లో 8, 9, 10వ తరగతుల విదార్థులకు ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలపై డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా స్క్రీన్‌పై ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం టెక్నాలజీ అభివృద్ధి చెందిందని, కొంతమంది దీనిని చెడు మార్గాల్లో ఉపయోగించుకొని నేరస్తులుగా మారుతున్నారని తెలిపారు. చెడు వ్యసనాలు, చెడు స్నేహం, సెల్ ఫోన్లను సరైన పద్ధతిలో ఉపయోగించుకోకుండా బంగారు భవిష్యత్తును నాశనం చేసుకొని నేరస్తులుగా మారుతున్నారని చెప్పారు. చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల ఆశయాలు, మీ లక్ష్యాలను నెరవేర్చుకుని భవిష్యత్తులో పదిమందికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. పాఠశాల సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, పర్యవేక్షకులు జయలక్ష్మి, భీమేష్, రాజు పాల్గొన్నారు.

మంత్రాలయం : సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సిఐ రామాంజులు సూచించారు. మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హంపయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు, ఈవ్ టీజింగ్‌కు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. అనధికార లింక్‌లను క్లిక్ చేయవద్దని, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని.. రుణాలు మంజూరు చేస్తామని.. కెవైసి అప్డేట్ అంటూ.. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలని.. తక్కువ ధరకు విలువైన వస్తువులు వస్తాయని ప్రలోభాలకు గురి చేస్తున్నారని తెలిపారు. అలాంటి ఆన్‌లైన్ మోసాలకు మోసపోవద్దని చెప్పారు. అలాంటి ఫోన్ కాల్స్ వచ్చినా, లేదా మోసపోయినా గంటలోపు 1930 నెంబర్‌కు వెంటనే ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే మోసపోయిన డబ్బును తిరిగి పొందేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. జమీర్ ఉన్నారు.

అంగన్వాడీ టీచర్ ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహల్లి గ్రామంలోని అంగన్వాడీ టీచర్ వడ్ల నాగమ్మ ఇంట్లో బుధవారం చోరీ జరిగింది. సిఐ రామాంజులు వివరాల మేరకు... చెట్నిహల్లి గ్రామంలో ఉన్న అంగన్వాడీ టీచర్ నాగమ్మ ఇంట్లో తలుపులకు ఉన్న తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న తులం బంగారు, రూ.10 వేల నగదు అపహరించారు. నాగమ్మ రెండు రోజులుగా మంత్రాలయంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతిపై శిక్షణకు వెళ్లారు. భర్త మల్లికార్జున కార్పెంటర్ పనికి మంత్రాలయం వెళ్లారు. కుమారుడు మనోజ్ కుమార్ మంత్రాలయంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. సాయంత్రం పాఠశాల నుంచి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఇంటికి చేరుకున్న నాగమ్మ బీరువాలో ఉన్న తులం బంగారు, రూ.10 వేల నగదు చోరీకి గురయినట్లు గుర్తించారు. చీరల కింది భాగంలో ఉన్న 5 తులాల బంగారు ఆభరణాలు అలాగే ఉన్నాయని చెప్పారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయగా హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. నాగమ్మ ఇంట్లో దొంగలు పడ్డారన్న విషయం తెలుసుకొని అంగన్వాడీ టీచర్లు శ్వేత, ప్రమీలమ్మ వచ్చి ధైర్యం చెప్పారు.


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి - స్వస్థ గ్రూప్ సాయిరాం ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఎస్పీ, ఎమ్మెల్యే బీవీ

ప్రయివేట్, ప్రభుత్వ వైద్యులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలో వీవర్స్ కాలనీలో అధునాతన సదుపాయాలతో ఏర్పాటు చేసిన స్వస్థ గ్రూప్స్ సాయిరాం నర్సింగ్ హోమ్ ఆస్పత్రిని ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసి, ఎమ్మెల్యే చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలో సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడారు. వైద్యులు సేవాభావంతో ముందుకెళ్లాలన్నారు. ఇలాంటి వైద్యశాలలు ఎన్ని వచ్చినా తాము ఎల్లప్పుడూ సహకరించి అన్ని సదుపాయాలూ కల్పిస్తామని తెలిపారు. గుండెపోటు నివారణకు ఇంజక్షన్లు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. స్వస్థ గ్రూప్ స్టార్ కేర్ యాజమాన్యం ఎమ్మిగనూరులో అధునాతన పరికరాలతో ఆస్పత్రిని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తామనడం సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ తల్లం శబరి గిరీష్, సామాజిక, పారిశ్రామిక వేత్త చంద్రశేఖర్, డీఎస్పీ ఉపేంద్ర బాబు, సిఐలు శ్రీనివాసులు, మధుసూదన్, గోనెగండ్ల సిఐ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, గ్రూప్ సభ్యులు జహీర్, నరసింహ గౌడ్, కెఎస్.శివన్న పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లపై సమీక్ష : త్వరలో రంజాన్ మాసం ఉపవాసాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పట్టణంలోని వివిధ మసీదుల పెద్దలతో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వివిధ మసీదుల వద్ద నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలను రంజాన్ మాసం ప్రారంభం కాకముందే పనులను ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నీటి సమస్య, వేసవి దృష్ట్యా మసీదుల వద్ద షెడ్ల నిర్మాణం, రోజూ పరిశుభ్రత, విద్యుత్ దీపాలు, పోలీసు బందోబస్తు, వాటర్ ట్యాంకర్ల ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వహీద్ హుసేన్, డిఎండబ్ల్యుఒ సబియా పర్వీన్, డీఎస్పీ ఉపేంద్ర బాబు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు హుస్సేన్ పీరా, టిడిపి మైనార్టీ నాయకులు బందే నవాజ్, తురేగల్ నజీర్ అహ్మద్, కలీముల్లా, అల్తాఫ్ పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య భరోసా

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా పేదలందరికీ ఆరోగ్య భరోసా కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కిందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. బుధవారం సిఎం రిలీఫ్ ఫండ్ కింద పేదలకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే చంద్రబాబు లక్ష్యమన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు హాస్పిటల్ ఖర్చులకు సంబంధించి బిల్లులు ఏమైనా ఉన్నా తమను సంప్రదిస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్యానికి అయిన ఖర్చులను రీయింబర్స్‌మెంట్ ద్వారా తిరిగి ఇప్పిస్తామని తెలిపారు. 10 మంది లబ్ధిదారులకు రూ.4.5 లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. టిడిపి నాయకులు బసాపురం రామస్వామి, అల్తాఫ్, లోకనాథ్ రెడ్డి, షాదుల్లా, శేషిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి ఉన్నారు.